క్లుప్తంగా

ఘనంగా గంగానమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట

తోట్లవల్లూరు: గరికపర్రులోని బాబూ జగ్జీవన్ రామ్ కాలనీలో గంగానమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. ఈ మహోత్సవంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. బీవీఆర్ చారిటబుల్ ట్రస్టు అధినేత బొమ్మారెడ్డి వెంకటరెడ్డి దాతృత్వంతో బీవీఆర్ యూత్ ఆధ్వర్యంలో భక్తులకు భారీ అన్నసమారాధన జరిగింది. అన్నదాన కార్యక్రమాన్ని బీవీఆర్ యూత్ అధ్యక్ష, కార్యదర్శులు శ్యామ్, సుబ్బారెడ్డి పర్యవేక్షించారు.

పెన్షన్ పంపిణీ వ్యవస్థను నిలుపదల చేయడం దుర్మార్గం

గుడివాడ టౌన్: వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు సంబంధించి పెన్షన్ పంపిణీ వ్యవస్థను నిలుపదల చేయడం దుర్మార్గం అని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్సీపీ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అధికార పార్టీ ఏదో చేస్తుందని ప్రతిపక్ష పార్టీలు పెన్షన్ పంపిణీని రాజకీయం చేయడం సరైన విధానం కాదన్నారు. ఐద్వా కార్యదర్శి పి.రజని పాల్గొన్నారు.

ఉషోదయలో కరాటే బెల్టు పోటీలు

జుఝువరం(పామర్రు): జుఝువరం గ్రామంలోని ఉషోదయ హైస్కూల్ ఆవరణలో కరాటే బెల్టుపోటీలను బుధవారం నిర్వహించారు. ఈ పోటీల్లో పాఠశాలకు చెందిన 31 మంది విద్యార్థులు పాల్గొని పలు రకాల బెల్టులను సాధించారు. ఎల్లో బెల్టు-16, ఆరెంజ్-14, గ్రీన్ -7, బ్లూ-2, బ్రౌన్ బెల్టు-2 చొప్పున సాధించారు. అనంతరం విజేతలకు సర్టిఫికెట్లు, బెల్టులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజేతలను, వీరికి శిక్షణ ఇచ్చిన కరాటే కోచ్ వీవీఎస్ రామకృష్ణను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

కిటకిటలాడిన సచివాలయాలు

గుడివాడ టౌన్: పెన్షన్ వలంటీర్లు పంపిణీ నిలుపుదల చేస్తూ ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఆదేశాలతో పెన్షనర్లు ఇబ్బందులకు గురయ్యారు. టీడీపీ నాయకులు ప్రభుత్వాన్ని ఇబ్బందులకు గురిచేయాలనే ఉద్దేశంతో పెన్షనర్లకు ఈనెలలో పెన్షన్ రాదని, ప్రభుత్వం వద్ద డబ్బు లేదని రకరకాలుగా తప్పుదారి పట్టించే ప్రయత్నాలు చేయడంతో లబ్ధిదారులు పెన్షన్ అందుతుందా లేదా అనే భయం పట్టుకుంది. బుధవారం పెన్షన్ పంపిణీ జరుగుతుందని తెలిసి ఉదయం 8 గంటలకే సచివాలయాల వద్దకు చేరుకున్నారు. 10 గంటలకు ఒక్కసారిగా పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు సచివాలయానికి చేరుకున్నారు. దీంతో ఇబ్బందులకు గురికావాల్సి వచ్చింది.

పామర్రులో..

పామర్రు: మండలంలోని అన్ని సచివాలయాల వద్ద బుధవారం సాయంత్రం సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ నెల 6వ తేదీ లోపు లబ్ధిదారులందరికీ పెన్షన్ అందజేస్తామని సచివాలయాల సిబ్బంది తెలిపారు. రాలేని వారి ఇళ్ల వద్దకు వెళ్లి పెన్షన్‌ను అందిస్తామని పేర్కొన్నారు.

తోట్లవల్లూరులో..

తోట్లవల్లూరు: తోట్లవల్లూరులో సామాజిక పింఛన్ల పంపిణీ బుధవారం మధ్యాహ్నం నుంచి ప్రారంభమైంది. టీడీపీ అధినేత చంద్రబాబు వలనే ఈ నెల పింఛన్ పంపిణీలో ఆలస్యమైందని పలువురు లబ్ధిదారులు వాపోయారు.

అంబేడ్కర్, పూలే జయంతి నిర్వహించాలి

మండవల్లి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతితో పాటు సామాజిక తత్వవేత్త మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి కార్యక్రమాలను ఈ నెల 11వ తేదీన అన్ని గ్రామాల్లో నిర్వహించాలని అంబేడ్కర్ అసోసియేషన్ మండవల్లి గౌరవాధ్యక్షుడు ఎల్ఎస్ భాస్కరరావు, కొరపాటి శాంతరాజు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

వైభవంగా భక్తాంజనేయ ఆలయ పునఃప్రతిష్ట



కై కలూరు: ఆంజనేయ నామస్మరణతో వ్యవసాయ మార్కెట్ ప్రాంతం మార్మోగింది. శ్రీ భక్తాంజనేయ దేవాలయ పునర్నిర్మాణ, పునఃప్రతిష్టా కార్యక్రమం బుధవారం జరిగింది. యంత్ర, విగ్రహ, శిఖర ప్రతిష్టలకు పెద్ద ఎత్తున భక్తులు విచ్చేశారు. ఆర్తమూరుకు చెందిన అయిలూరి జైకిషోర్ శిష్యబృందం ప్రతిష్ట పూజలు చేశారు. ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) చిన్న కుమారుడు ఫణి శ్యామ్‌కుమార్, స్వాతి దంపతులు యాగపూజలలో పాల్గొన్నారు. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు సతీమణి వీరాకుమారి, పెద్ద కుమారుడు దూలం వినయ్, శ్రీఅనుపమా దంపతులు, ఏఎంసీ చైర్మన్ చేబోయిన వీరరాజు, నాయకులు బుర్ల సత్యనారాయణ, జంపన కొండరాజు, దుర్గారావు, రాగాల వెంకటేశ్వరరావు, నిమ్మల సాయి, బొప్పన శివకుమార్, వసుంధర మురళీ, సింహాచలం, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అవ్వాతాతల ఉసురు చంద్రబాబుకు తప్పదు

పింఛన్ల కోసం పండుటాకుల కష్టాలు

వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి 2024 మార్చి ఒకటో తేదీ వరకు ప్రతి నెలా తెల్లవారుజామునే వలంటీర్లు అవ్వాతాతల ఇళ్లకు వెళ్లి పింఛన్‌ను ఠంచన్‌గా అందించేవారు. అయితే చంద్రబాబు నాయుడు దుష్ట పన్నాగం ఈ నెల పింఛన్ పంపిణీకి అవరోధంగా మారింది. వలంటీర్లు పింఛన్ ఇచ్చేందుకు వీలు లేదని చంద్రబాబు ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేయడంతో లబ్ధిదారులు సచివాలయాలకు రావాల్సి వచ్చింది. దీంతో అవ్వాతాతలు, దివ్యాంగులు బుధవారం ఆయా పంచాయతీల్లోని సచివాలయాలకు ఎన్నో కష్టాలు పడుతూ వచ్చారు. నడవలేని స్థితిలో ఉన్న వృద్ధులు, దివ్యాంగులు మాట్లాడుతూ 'మా లాంటి వాళ్లను ఈ విధంగా కష్టపెట్టేందుకు కారణమైన చంద్రబాబుకు మా ఉసురు తగిలి పోతాదని' అంటూ కన్నీళ్లు పెట్టుకున్నారు. లబ్ధిదారుల కష్టాలు వారి మాటల్లోనే.. - సాక్షినెట్‌వర్క్



గుడ్లవల్లేరులోని సచివాలయం వద్ద పింఛన్ కోసం వేచియున్న లబ్ధిదారులు

కైకలూరు: అవ్వాతాతలు, దివ్యాంగులు, వితంతు అక్కచెల్లెమ్మలకు వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే పింఛన్‌ను వలంటీర్లు ప్రతి నెలా ఒకటో తేదీన లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వచ్చి అందజేస్తున్న విషయం తెలిసింది. వలంటీర్లు పింఛన్ల పంపిణీలో జాతీయ స్థాయిలో అవార్డులను కూడా అందుకున్నారు. కూటమికి చెందిన నాయకులు ఈసీకి ఫిర్యాదులు చేయడంతో పింఛన్లు పంపిణీ చేయకుండా వలంటీర్లపై నిషేధం విధిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం మార్చి 30న నిర్ణయం తీసుకుంది. దీంతో ఈ నెల ఒకటో తేదీన అందాల్సిన పింఛను వలంటీర్లు లేకపోవడంతో రాలేదు. ఈ నేపథ్యంలో బుధవారం సచివాలయాలకు వచ్చేందుకు లబ్ధిదారులు ఇబ్బందులు పడ్డారు.



నడవలేని స్థితిలో ఉన్నా..

వలంటీర్ ముందుగా మా ఇంటికి వచ్చి పెన్షన్ ఇచ్చేవారు. 80 సంవత్సరాలు పైబడిన వయస్సులో నడుంజారి నడవలేని స్థితిలో ఉన్నాను. సచివాలయానికి వెళ్లి పింఛన్ తీసుకోవాల్సి వచ్చింది. పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు గుమికూడటంతో నాకు చాలా ఇబ్బంది కలిగింది. ఎన్నికల కమిషన్ ఇలాంటి నిర్ణయం తీసుకోవడం మాలాంటి వారికి ఎంతో ఇబ్బంది కలిగించింది. - వడ్డే పుష్పావతి, గుడివాడ టౌన్

మూడు కిలోమీటర్ల నడుచుకుంటూ వచ్చా



పింఛన్ కోసం మూడు కిలోమీటర్ల దూరం నుంచి సచివాలయం-1 వద్దకు ఉదయాన్నే చేరుకున్నా. టీడీపీ నాయకులు చేసిన చెత్తపనికి పింఛన్ లబ్ధిదారులు అందరూ చాలా ఇబ్బందులు పడుతున్నారు.

- కొత్తపల్లి రామారావు, పింఛన్ లబ్ధిదారుడు, నాగపట్నం

ఉసురు పోసుకుంటున్నారు



ప్రతి నెలా ఒకటో తేదీన ఇచ్చే పింఛను డబ్బులు మందులకు వాడుకునేవాళ్లం. ఆ పింఛన్‌ను సమయానికి ఇవ్వకుండా అడ్డుపడుతూ మా ఉసురు పోసుకుంటున్నారు. ఇలా అడ్డుకునేవాళ్లు అధికారంలోకి వస్తే ఇంకేమైనా ఉందా? ఇప్పటికైనా పింఛన్లను ఇంటికే పంపించే విధంగా చర్యలు తీసుకుంటే వృద్ధులకు మేలు చేసిన వాళ్లు అవుతారు. కర్ర పట్టుకుని కుంటుకుంటూ కార్యాలయానికి వెళ్లాలంటే ఎక్కడ సాధ్యమవుతుంది.

- కాగిత కమలమ్మ, దోకిపర్రు, గుడ్లవల్లేరు మండలం

నాలుగున్నర ఏళ్లుగా ఇబ్బందులు లేవు



ఈ ఏడాది మార్చి వరకు ఏవిధమైన ఇబ్బందులు లేకుండా పెన్షన్‌ను వలంటీర్లు ఇంటికి తీసుకొచ్చి ఇచ్చారు. ప్రస్తుతం టీడీపీ వాళ్లు చేసిన నిర్వాకంతో పెన్షన్ కోసం సచివాలయాల వద్ద నడుచుకుంటూ రావాల్సి వస్తోంది. అసలే మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్నా. చాలా బాధగా ఉంది.

- జి. రాములమ్మ, పెన్షనర్, పామర్రు

ఆ రోజులు తలచుకుంటే భయమేస్తుంది



నా వయస్సు 70 సవత్సరాలు. ప్రభుత్వం ఇచ్చే పింఛన్ నాకు జీవనాధారం. జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక ఒకటో తేదీన ఎక్కడికి వెళ్లాల్సిన పని లేకుండా వలంటీర్ నేరుగా ఇంటికే వచ్చి ఫించన్ ఇస్తుంటే చాలా ఆనందంగా ఉండేది. ఇప్పుడు పెన్షన్ సొమ్ము కోసం గతంలో మాదిరిగా కార్యాలయానికి వెళ్లాలంటే చాలా ఇబ్బంది పడతాం. చంద్రబాబు పాలన రోజులు తలచుకుంటేనే చాలా భయమేస్తోంది. ఇంటి దగ్గరికి వచ్చి పింఛన్ ఇచ్చే ఏర్పాటు చేయాలి. -లక్ష్మమ్మ, లక్ష్మీనరసింహపురం, నందివాడ మండలం

చంద్రబాబు పేదల ద్రోహి



గత చంద్రబాబు ప్రభుత్వంలో పెన్షన్ల కోసం పంచాయతీల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగే పరిస్థితి, జగనన్న ప్రభుత్వంలో వలంటీర్లు ఇళ్ల వద్దకే వచ్చి పెన్షన్ ఇస్తున్నారు. దీనిని జీర్ణించుకోలేని చంద్రబాబు వలంటీర్లపై ఫిర్యాదు చేయడం దారుణం. మూడు నెలల పాటు సచివాలయాల వద్దకు వెళ్లి పింఛన్ తీసుకోవాలంటే ఈ వయస్సులో చాలా కష్టంగా ఉంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ రావాలి.

- అబ్దుల్ హమీద్, పెన్షనర్, పామర్రు కైకలూరు

మా లాంటి పెద్దల ఉసురు తగలదా..



నా పేరు సప్పా చిన్నమ్మ. నా వయస్సు 69 సంవత్సరాలు. నాకు 90 శాతం వైకల్యం ఉంది. నా భర్త మరణించాడు. ఒంటరిగా జీవిస్తున్నా. ప్రతి నెలా ఒకటో తేదీన కోడి కూయకముందే ఇంటికొచ్చి వలంటీర్ పింఛను ఇస్తోంది. ఆమె ఎందుకు రాలేదో మాకు అర్థం కావడం లేదు. మరో కొన్ని నెలలు మాకు ఈ బాధలు తప్పవంట. అసలు రాజకీయాలకు వలంటీర్లకు సంబంధం ఏమిటీ? వలంటీర్లను అడ్డుకున్న వారికి మా లాంటి పేదల ఉసురు తగులుతుంది.

- సప్పా చిన్నమ్మ, దివ్యాంగ పింఛనుదారు,

మా ఉసురు తగులుతుంది



నాకు 68ఏళ్లు. ఎక్కువ దూరం నడవలేను. ప్రతి నెలా ఒకటో తేదీ తెల్లవారు జామునే వలంటీర్ ఇంటికి వచ్చి పెన్షన్ ఇచ్చేవారు. పెన్షన్ డబ్బు వల్ల ప్రతి నెలా మందులు టైంకు తీసుకునేదాన్ని. ఈ సారి రెండురోజులు గడిచి మూడో రోజు పెన్షన్ ఇవ్వడం వల్ల రెండు రోజుల నుంచి మందులు వేసుకోలేదు. పెన్షన్ డబ్బులు అందితేనే నాకు పూట గడిచేది. టీడీపీ నాయకులు వలంటీర్లపై ఫిర్యాదు చేయడం దారుణం. మా ఉసురు టీడీపీకి తగలకమానదు.

-బి.సత్యమ్మ, నందివాడ

చంద్రబాబు పుణ్యమా అని పడిగాపులు



నా పేరు అర్జా రవి. నాది మండవల్లి గ్రామం. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వలంటీర్ల ద్వారా ఒకటో తేదీ ఉదయం 5 గంటలకు ఇంటి వద్దకే పింఛను ఇచ్చేలా చేశారు. చంద్రబాబు పుణ్యమా అని ఈ నెల ఆ పరిస్థితి లేదు. వేసవి ఎండలో సచివాలయం వద్ద రావాల్సి వచ్చింది. మా ఉసురు ఆయనకు తప్పకుండా తగులుతుంది.

- అర్జా రవి, మండవల్లి

మా కన్నీళ్లు.. వారికి శాపంగా మారుతాయి



నాకు చిన్ననాటి నుంచి కాలు, చేయికి పోలియో సోకింది. భర్త మరణించాడు. పోలియో వల్ల ఏ పని చేసుకోలేను. నేను ఒంటరిగా జీవిస్తున్నా. ప్రతి నెలా ప్రభుత్వం ఇచ్చే రూ.3 వేలు వికలాంగ పింఛను సొమ్మే నాకు ఆధారం. నడిచే ఓపిక లేకపోయినా తెల్లవారుజామున ఐదు గంటలకు కైకలూరు సచివాలయానికి వచ్చాను. మొన్నటి వరకు వలంటీర్లు ఒక్క రూపాయి తీసుకోకుండా నాకు ఒకటో తేదీనే పింఛను ఇచ్చారు. ఈ రోజు వాళ్లు లేరు. దీనికి కారకులైన వాళ్లకు నా కన్నీళ్లు శాపంగా మారతాయి.

- ఎన్ను మంగమ్మ, దివ్యాంగ పింఛనుదారు, కైకలూరు

పింఛను సొమ్మే ఆధారం



ఈ ఫొటోలోని వృద్ధుడు లింగాల గ్రామానికి చెందిన నీలకంఠ సత్యనారాయణ. ఇతను తాపీ కార్మికుడుగా జీవిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గతేడాది జూలైలో వృద్ధాప్య పింఛను మంజూరైంది. ప్రతి నెలా ఒకటో తేదీనే ఠంచనుగా వలంటీరు ఇంటికి వచ్చి పింఛను అందిస్తున్నాడు. ఈ పింఛను సొమ్మే ఇతడికి ఆధారం. ఇప్పుడు వలంటీర్ ఇంటికి వచ్చి పింఛను ఇవ్వరని, సచివాలయానికి వెళ్లి తీసుకోవాలని చెబుతున్నారు. సచివాలయానికి వెళ్లే సత్తువ లేక పింఛను అందే దారి తెలియక అయోమయానికి గురై ఆందోళన చెందుతున్నాడు. వృద్ధులపై టీడీపీకి ఇంత కక్ష ఎందుకో తెలియడం లేదని, దీనికి తగిన గుణపాఠం చెప్పేందుకు రేపటి ఎన్నికల్లో తనలాంటి వారంతా సిద్ధంగా ఉన్నారని చెబుతున్నాడు.

- నీలంకంఠ సత్యనారాయణ, లింగాల, మండవల్లి మండలం

ప్రతిపక్ష నాయకులతో ఇబ్బందులు



ఒక పక్క వేసవి ప్రారంభమై ఎండలు మండుతుండగా పింఛను లబ్ధిదారులకు చంద్రబాబు, పవన్ కల్యాణ్ వంటి నాయకులు చుక్కలు చూపిస్తున్నారు. ఉదయం 5 గంటలకే వలంటీర్లు ఇంటికి వచ్చి ఆనందోత్సాహాలతో పింఛను రూ.3 వేలు అందజేసేవారు. వీరికి వలంటీర్లపై ఉన్న కక్ష కారణంగా ఈసీకీ ఫిర్యాదు చేసి, వారిని ఇళ్లకు రాకుండా చేశారు. వితంతు, వృద్ధాప్య పింఛనుదార్లు మండుటెండలో సచివాలయానికి వెళ్లి పడిగాపులు పడి పింఛను తీసుకోవాల్సి వచ్చింది. ప్రజలపై వారికి ఉన్న ప్రేమాభిమానాలు ఏపాటివో అర్థమవుతోంది.

- చొప్పరపు పిచ్చియ్య, మండవల్లి

కొడాలి నాని ప్రచారానికి భారీగా మద్దతు



యువకుడితో ఎమ్మెల్యే కొడాలి నాని కరచాలనం



ఎమ్మెల్యే కొడాలి నానికి హారతి ఇస్తున్న మహిళ

గుడివాడ టౌన్: గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) ఎన్నికల ప్రచారం బుధవారం స్థానిక బేతవోలు 27, 28 వార్డులలో కొనసాగింది. పెద్ద సంఖ్యలో స్థానికులు కొడాలి నానికి మద్దతుగా ప్రచారంలో ఆయన వెంట నడిచారు. తొలుత బేతవోలు హైస్కూల్ వెనుక గల ఆంజనేయస్వామి దేవస్థానంలో పూజలు నిర్వహించి కార్యకర్తలతో కలిసి ప్రచారం ప్రారంభించారు. గడప గడపకు తిరుగుతూ ఓటర్లకు అభివాదం చేస్తూ ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేయాలని కోరారు. యువతకు కరచాలనం చేస్తూ వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలని కోరారు. మహిళలు పెద్ద ఎత్తున మంగళ హారతులు ఇచ్చారు. గత నాలుగు సార్లు జరిగిన ఎన్నికల్లో తాను మీకే ఓటు వేశానని ఈ ఎన్నికల్లో సైతం ఓటు వేస్తానని, నా ఆశీస్సులు మీకు విజయాన్ని చేకూరుస్తుందని ఓ వృద్ధురాలు ఎమ్మెల్యేను ఆశీర్వదించారు. అధిక సంఖ్యలో అభిమానులు, కార్యకర్తలు, నాయకులు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ వివిధ విభాగాల అధ్యక్ష కార్యదర్శులు, మహిళా కార్యకర్తలు ఎమ్మెల్యే వెంట ప్రచారంలో పాల్గొన్నారు.

టీడీపీకి గుణపాఠం తప్పదు

ముదినేపల్లి రూరల్: సామాజిక పింఛన్ల పంపిణీని రాజకీయ దురుద్దేశంతో అడ్డుకున్న టీడీపీకి ఎన్నికల్లో గుణపాఠం తప్పదని స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) కోడలు దూలం స్వాతి, ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు ఈడే వెంకటేశ్వరమ్మ అన్నారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా మండలంలోని బొమ్మినంపాడులో బుధవారం ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా పలువురు వృద్ధులు, దివ్యాంగులు ఈ నెల పింఛన్ల పంపిణీ సక్రమంగా అందకపోవడంపై తాము పడుతున్న అవస్థలను నాయకుల వద్ద ప్రస్తావించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వలంటీర్లు జగనన్న పాలనలో ఇంటి ముంగిటకే వచ్చి ప్రతి నెలా ఒకటో తేదీ ఉదయమే తలుపు తట్టి పింఛన్లు ఇస్తూ గతంలో పడ్డ అవస్థలు తొలగించారన్నారు. దీంతో వీరంతా ముఖ్యమంత్రి జగన్‌కే అండగా నిలుస్తున్నారనే భయంతో వలంటీర్లపై కక్ష గట్టి వారి ద్వారా పింఛన్ల పంపిణీని టీడీపీ నేతలు అడ్డుకున్నట్లు ఆరోపించారు. హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, వైస్ ఎంపీపీలు రాచూరి రాధా, చొప్పర్ల సునీత, నాయకులు మోత్రు ఏసుబాబు, కోమటి విష్ణువర్ధన్, పేర్ని పృథ్వీ పాల్గొన్నారు.



బొమ్మినంపాడులో ప్రచారం చేస్తున్న దూలం స్వాతి, నాయకులు

కులమతాలకు అతీతంగా పథకాలు అమలు

కైకలూరు: పార్టీలు, కులాలు, మతాలు చూడకుండా నియోజకవర్గంలో ప్రతి కుటుంబానికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాయని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) సతీమణి వీరాకుమారి అన్నారు. ఆచవరం పంచాయతీ పరిధి ఆనందరావుపేటలో బుధవారం ఆమె ఇంటింటికీ తిరిగి వైఎస్సార్ సీపీకి విజయం చేకూర్చాలని ఓటర్లను అభ్యర్థించారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా డీఎన్నార్, ఎంపీగా కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎంపీపీ అడవి కృష్ణ, వేమవరప్పాడు, గోపవరం సర్పంచ్‌లు నున్న రాంబాబు, ఉలసి వసంతకుమారి, నాయకులు బుర్ల పోతురాజు, ధర్మరాజుల సూర్యనారాయణ, ఉలిసి శ్రీనివాసరావు, సన్నిధి కృష్ణ, పంజా నాగు, కన్నా రమేష్, లాజరు పాల్గొన్నారు.

మేలు చేసిన వారిని ఆదరించండి

కలిదిండి: ప్రజలకు మేలు చేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మరోసారి ఎన్నుకోవాలని ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) పెద్ద కోడలు శ్రీఅనుపమ కోరారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారం భాగంగా పడమటిపాలెంలో నాయకులతో కలిసి బుధవారం ఇంటింటా ప్రచారాన్ని చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన మేలును ప్రజలకు వివరించారు. వారు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వానికి జగనన్న ప్రభుత్వానికి మధ్య తేడా గుర్తించాలన్నారు. ఏలూరు పార్లమెంట్ అభ్యర్థిగా కారుమూరి సునీల్ కుమార్ యాదవ్, కై కలూరు అసెంబ్లీ అభ్యర్థిగా దూలం నాగేశ్వరరావును గెలిపించాలని కోరారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తిరుమాని రమేష్, సర్పంచ్‌లు సాన మీనా సరస్వతి, బొర్రా వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీపై రాజకీయాలు దారుణం

ఎమ్మెల్యే డీఎన్నార్

కలిదిండి: ప్రజల అభిమానం పొందాలంటే మంచి చేయాలి, కానీ ఇలా అవ్వాతాతలకు ఇస్తున్న పింఛన్ల పంపిణీపై రాజకీయాలు చేయడం దారుణం అని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. కలిదిండిలోని 11వ రోజు 11వ వార్డులో గుడ్ మార్నింగ్ కలిదిండి కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డీఎన్నార్ మాట్లాడుతూ పింఛన్లు సకాలంలో వారి ఇంటి వద్దకే వెళ్లి సేవలు అందిస్తున్న వలంటీర్లపై అక్కసుతో ప్రతిపక్ష నాయకులు కుట్రలు పన్ని వారికి సకాలంలో సేవలు అందించటానికి వీలు లేకుండా చేస్తున్నారన్నారు. వలంటీర్ వ్యవస్థపై చంద్రబాబు మొదటి నుంచి విమర్శలు చేసేవారని ఆరోపించారు. కార్యక్రమంలో ఎంపీపీ చందన ఉమామహేశరరావు, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి శ్రీదేవి, సర్పంచ్ మసీముక్కు మారుతి ప్రసన్న, వైస్ ఎంపీపీ కూసంపూడి కనక దుర్గారాణి, ఎంపీటీసీ సభ్యుడు సుమన్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తిరుమాని రమేష్, పీఏసీఎస్ అధ్యక్షుడు వడుపు రామారావు పాల్గొన్నారు.



గుడ్ మార్నింగ్ కలిదిండి కార్యక్రమంలో ఎమ్మెల్యే డీఎన్నార్‌తో నాయకులు

గ్రామ స్వరాజ్యం సీఎం జగన్‌తోనే సాకారం



మాట్లాడుతున్న మచిలీపట్నం ఎంపీ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖరరావు, ఎమ్మెల్యే అనిల్‌కుమార్

పమిడిముక్కల: గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డితో సాకారం అవుతుందని మచిలీపట్నం వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు పేర్కొన్నారు. ప్రజలకు మంచి జరగాలంటే మరోసారి జగన్ సీఎం కావాలన్నారు. వీరంకిలాకు కేఎస్ఆర్ నగర్‌లో వైఎస్సార్ సీపీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పార్టీ శ్రేణులతో కలిసి ప్రారంభించారు. అనంతరం బూత్ కమిటీ, కార్యకర్తలకు జరిగిన సమావేశంలో ఎంపీ అభ్యర్థి సింహాద్రి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అధికార వికేంద్రీకరణ జరిగిందని, ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. తాను అవనిగడ్డలో పుట్టిపెరిగానని, తనను, ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ మాట్లాడుతూ సీఎం జగన్ ప్రభంజనాన్ని ఎవరూ ఆపలేరని, ఎన్ని పార్టీలు కలిసినా వచ్చిన ఇబ్బందేమీ లేదన్నారు. గ్రామాల్లో అందరూ కలిసికట్టుగా పనిచేయాలని, అందరూ తనకు కుటుంబ సభ్యులతో సమానమన్నారు. టీడీపీ అభ్యర్థి కులాల మధ్య చిచ్చుపెట్టి లబ్ధి పొందేందుకు కుట్రలు పన్నుతున్నాడన్నారు. అవ్వాతాతలను ఎందుకు ఇబ్బంది పెడుతున్నారని, వలంటీర్లు పెన్షన్ ఇస్తే తప్పేంటని ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి గెలిపించాలన్నారు. ఈ సందర్భంగా హనుమంతపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు రాజులపాటి పోతురాజు వైఎస్సార్ సీపీలో చేరారు. ఎంపీపీ కాసాని వేద సుప్రజ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యలమంచిలి గణేష్, గౌడ, రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్లు శొంఠి వెంకటేశ్వరరావు, కంభపు రాంబాబు, వైస్ ఎంపీపీలు కొడమంచిలి మహేష్, గంజాల సీతారామయ్య, ఎంపీటీసీ గుర్విందపల్లి వంశీ, నాయకులు యేనుగ మస్తాన్‌రావు, మర్రి దుర్గారావు, పాతూరి చంద్రపాల్ పాల్గొన్నారు.

పింఛన్ కోసం లబ్ధిదారుల అగచాట్లు

మొవ్వ: గతాన్ని గుర్తు చేసే విధంగా మొవ్వ మండలంలోని వృద్ధులు, వితంతువులు పింఛన్ నగదు కోసం బుధవారం సచివాలయాల వద్ద అగచాట్లు పడ్డారు. నాలుగున్నరేళ్లకు పైగా ప్రతి నెలా ఒకటో తేదీన వలంటీర్ల ద్వారా ఇంటి వద్దే పింఛను తీసుకునే లబ్ధిదారులు టీడీపీ నాయకుల నిర్వాకంతో సచివాలయాల వద్దకు రాలేక ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం మూడు గంటల నుంచి పింఛను నగదు పంపిణీ ప్రారంభమైంది. మొవ్వ మండలంలో 8,809 మందికి పింఛన్ అందించాల్సి ఉండగా 1,811 మందికి పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ చంద్రశేఖరరావు తెలిపారు.

అభివృద్ధిని అడ్డుకున్నది టీడీపీ నాయకులే



విలేకరులతో మాట్లాడుతున్న మండలి హనుమంతరావు

గుడివాడ టౌన్: గుడివాడ పట్టణంలో అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకున్నది టీడీపీ నాయకులేనని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి హనుమంతరావు అన్నారు. ఆయన వ్యక్తిగత కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. టీడీపీ నాయకులు ప్రెస్‌మీట్లు పెట్టి ఎమ్మెల్యే కొడాలి నాని ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ పాలనలో పట్టణం అభివృద్ధికి నోచుకోలేదని అనడం సిగ్గుచేటన్నారు. నీటి సమస్య తలెత్తిందని అనడం సరికాదన్నారు. పట్టణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు 105 ఎకరాలు భూమి సేకరించి కోట్ల రూపాయలు హెచ్చించి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మించిన ఘనత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డిదేనన్నారు. వేసవి తాకిడిని దృష్టిలో ఉంచుకుని అవసరమైన చోట్ల బోరులు వేసేందుకు ఏర్పాట్లు చేస్తే ఎన్నికల కోడ్ వచ్చేసిందన్నారు. ఇక పట్టణాభివృద్ధికి ప్రధానంగా కౌన్సిల్ ఎన్నిక జరగాలని అది జరగకుండా కోర్టుకు వెళ్లి స్టే తీసుకొచ్చింది అప్పటి టీడీపీ పట్టణ అధ్యక్షుడు దింట్యాల రాంబాబు, ఇన్‌చార్జి అనుచరుడు రమేష్ అని తెలిపారు. పట్టణ విస్తీర్ణాన్ని పెంచి పెద్ద మొత్తంలో నిధులు తీసుకురావాలనే సంకల్పంతో పట్టణ శివారు ప్రాంతాలైన భూషణగుళ్ల, బిళ్లపాడు, బొమ్ములూరు, మల్లాయిపాలెం, లింగవరం గ్రామాలను విలీనం చేస్తుంటే అడ్డుపడింది టీడీపీ నాయకులేనన్నారు. ప్రతి విషయంలో రాజకీయం చేస్తూ అధికారులను బెదిరిస్తూ పనులు జరగకుండా అడ్డుపడుతున్నది టీడీపీ నాయకులు కాదా అని ప్రశ్నించారు. దీనిపై చర్చకు తాను సిద్ధం అని చాలెంజ్ విసిరారు. ప్రజలు నీచ రాజకీయాలను గమనిస్తున్నారని కచ్చితంగా టీడీపీకి రానున్న ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెపుతారన్నారు.